

చికెన్‌కు చిక్కులు

వెంటాడుతున్న బర్డ్‌ఫ్లూ భయాలు
ఆదివారం వెలవెలబోయిన దుకాణాలు
జోరుగా మటన్, చేపలు,రొయ్యల అమ్మకాలు

బర్డ్‌ఫ్లూ దెబ్బకు జిల్లాలో చికెన్ విక్రయాలు తుడిచిపెట్టుకు పోయాయి. పది రోజులుగా బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ కొనడం, తినడం మానేయడంతో ఈ ఆదివారం వ్యాపారులే స్వచ్ఛందంగా చికెన్ విక్రయాలు నిలుపుదల చేశారు. మటన్, చేపలకు డిమాండ్ పెరిగింది. గతంలో కేజీ మటన్ రూ.800లకు విక్రయించగా తాజాగా వెయ్యి నుంచి రూ.1200 వరకూ విక్రయాలు చేశారు. చేపలు కేజీ రూ.130 ఉండేవి రూ.180కి పెంచారు. కేజీ రొయ్యలు రూ.250 నుంచి రూ.350కి అమ్మారు. 7



ఏలూరులో కిటకిటలాడుతున్న చేపల మార్కెట్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కలెక్టరేట్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 17న సోమవారం తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు.

బావాయిపాలెంలో యువకుడి దారుణ హత్య

చేయి నరికి తీసుకువెళ్లిన దుండగులు 7

ఎమ్మెల్సీ పోలింగ్‌కు కసరత్తు

ఆరు జిల్లాల్లో 2 వేలకు పైగా ఎన్నికల విధులకు..
ఈనెల 22న తుది విడత శిక్షణ

రైతులకు.. భూ ఆధార్!



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా భూముల వివరాలు నమోదు చేయడంతో పాటు వ్యవసాయ పథకాలు అందించేందుకు కొత్తగా భూ ఆధార్ అనే కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. 14 అంకెలు కలిగిన భూ ఆధార్ కార్డును రైతులకు అందిస్తారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యం. ఇది కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమంగా పేర్కొనవచ్చు.

నమోదు ఇలా..

రైతులు ఆధార్ కార్డు నెంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరాలు (పట్టాదార్ పాస్‌బుక్)లు తీసుకుని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పంట బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు పొందేందుకు ఈ సంఖ్య ఎంతో ఉపయోగపడుతుంది.

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలో భాగంగా ఏలూరు జిల్లాలో విశిష్ట గుర్తింపు కోసం 1,686 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 1,679 మంది సొంతభూమి గల రైతులు, ఏడుగురు సొంతభూమి ఉండి కౌలు చేసే రైతులు వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జిల్లాలో 3.35 లక్షల మంది రైతులు ఉండగా వివిధ పంటలకు సంబంధించి సాగుభూమి 2.65 లక్షల ఎకరాలు ఉంది.

- సొంత భూమి ఉంటే 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య
- జోరుగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ
- జిల్లాలో ఇప్పటివరకు 1,686 మంది రిజిస్ట్రేషన్

ఎంతో ప్రయోజనకరం..

రైతులకు (సాగుదారులకు) ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడం రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఈ గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వం అందించే అన్ని పథకాలు సకాలంలో అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే జిల్లాలో నమోదు కార్యక్రమం ప్రారంభమైంది.

- హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి



ఎస్ఎస్‌పీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఎంపీ మహేశ్

ప్రతి ఎకరాకు నీరందిస్తాం..

మంత్రి కొలుసు, ఎంపీ పుట్టా

ముసునూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత 30 ఏళ్లుగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలను త్వరలో పరిష్కరించి ప్రతి ఒక్క రైతుకు సాగునీరు అందించడమే లక్ష్యమని, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కాట్రేనిపాడు సమీపంలో అసంపూర్తిగా ఉన్న వేంపాడు - మధీరపల్లి సాగర్ కాల్వను ఆదివారం పరిశీలించారు. ఎస్ఎస్‌పీ ఈఈ ఆర్‌.సంతోష్, డీఈ వెంకటేశ్వరరావులతో మాట్లాడి కాల్వ వివరాలను తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. కాల్వ సమస్యను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాగర్ కాల్వల మరమ్మతులను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించడంతో ముళ్లపొదలు, తుప్పలు పెరిగిపోయి ప్రవాహానికి ఆటంకంగా మారిందని మంత్రి పార్థసారథి ఆరోపించారు. నిధులు మంజూరు చేయించి వేంపాడు మేజర్ కాల్వతో పాటు మైనర్ కాల్వల్లో ఉన్న జంగిల్‌ను తొలగించి చివరి భూములకు సైతం సాగునీటిని అందిస్తామన్నారు. ఎంపీ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం నీటికోసం రైతులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ పథకం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డీసీ చైర్మన్ రావూరి బాలకృష్ణ, ఎస్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోటా వీరబాబు, ఏఈ సతీష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు..పరుగులు!

గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ పక్కా ఇళ్లంటూ తెగ మురిపించి డీలా చివర లే-అవుట్లలో మమ అనిపించారు. ఇళ్ల నిర్మాణాల కొచ్చేసరికి మూడున్నరేళ్ల పాటు అస్సీ తప్పటడుగులే. ఆఖరికి పేదల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరగకముందే జగన్ జమానా ముగిసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ మధ్యనే తాజాగా పూర్తైన ఇళ్లకు గృహ ప్రవేశాలకు అస్సీ విర్పాట్లు చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకి వచ్చింది. అయితే పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం ఇచ్చేలా చూడాలని తాజాగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఇక పేదోడి ఇంటికి కొత్త కళ

- వచ్చే జూన్ నాటికి భారీగా నిర్మాణం
- ఈలోపు పూర్తయిన ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- స్థలం ఉండి ఇళ్లు కట్టకపోతే కొత్తగా పట్టాలు
- పాత ఇళ్ల పరిస్థితిపై టెన్షన్



అంతా సవ్యంగా జరిగినా..

ఒకరోజు కాదు రెండు రోజులు కాదు ఏళ్ల తరబడి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సాగాయి. ఒక పద్ధతి పాడు లేకుండా ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలను వదిలి వేరే ప్రాంతాల్లో నిర్మాణాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2019 తర్వాత జగన్ జమానాలో దాదాపు 750కు పైగా లే-అవుట్లలో 84,393 పైగా ప్లాట్లను వేశారు. వీటిలో కేవలం 75,306 మాత్రమే పట్టాలు ఇచ్చారు. జగన్ హయాంలో జరిగిన జిమ్మిక్కుల్లో భాగంగా ఇళ్లు మంజూరుకు వచ్చేసరికి మళ్లీ దగా చేశారు. కేటాయించిన పట్టాల్లో కేవలం 51,980 ఇళ్లనే నిర్మించేందుకు మంజూరు ఇచ్చారు. ఇక్కడ పట్టాలు, మంజూరైన గృహాల వ్యత్యాసం 23,326గా ఉంది.

కైకలూరులోని జగనన్న మోడల్ కాలనీ మాదిరిగానే ఏలూరుతో సహా మిగతా చోట్ల నిర్మించబోతున్నట్లు ఆనాడు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ మధ్యనే పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికోసం గృహ ప్రవేశాలను చేసేందుకు వీలుగా మూడు నెలలు పాటు అధికారులను పరుగులు పెట్టించారు. గృహ నిర్మాణశాఖలో సిబ్బంది కొరత వెంటాడుతున్నా ఈనెల ఒకటో తేదీకి గృహ ప్రవేశాలు జరిగేలా ఏర్పాట్లు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వేదికగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆరంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా వాయిదా పడింది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత సాధ్యమైనంత త్వరగా పేదలకు ఇళ్లను స్వాధీనపరచడానికి సమాయత్తం అవుతున్నారు. తాజాగా వివిధ ప్రభుత్వ విభాగాల కార్యదర్శులతో సీఎం నిర్వహించిన సమీక్షలో గృహ నిర్మాణశాఖకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వం జరిపిన ఇళ్ల నిర్మాణం పూర్తయితే వాటిని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఇదే తరుణంలో వచ్చే 2026 జూన్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని, వాటిని ఒకే రోజు ప్రారంభించేలా ఏర్పాట్లను చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

స్వల్ప వ్యవధిలో సాధ్యమేనా..?

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం ఇంత స్వల్ప వ్యవధిలో పూర్తి అవుతుందా..? అనే అనుమానం లేకపోలేదు. ఐదేళ్లుగా ఇసుక అందుబాటులో రావడంతో ప్రభుత్వం మిగతా పనులకు పుష్కలంగా నిధులిస్తే ఇది సాధ్యమేనని గృహ నిర్మాణ అధికారులు చెబుతున్నారు. 2014-19 నిధులు సమకూర్చకుండా మొఖం చాటేసింది. ఫలితంగా వేలాది పేద కుటుంబాలు సొంతింటి కలకు దూరం అయ్యాయి. ఈ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు, వీటిపైనా శ్రద్ధ పెడతామని అధికారులు చెబుతున్నారు. ఇదే తరుణంలో స్థలం కేటాయించి ఇళ్లు కట్టుకోకపోతే ప్రభుత్వ విధానం ప్రకారం పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున అర్హులైన పేదలకు స్థలాలు ఇవ్వాలనే నిర్ణయం అమలు చేయబోతున్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రజలు మెచ్చేలా ఈ తరహా పనులన్నింటినీ పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ఆక్రమణల చెరలో మేడవరపు చెరువు



మేడవరపు చెరువు

చింతలపూడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాల్వ పుట్టుకైన శెట్టివారిగూడెం గ్రామం వద్ద ఉన్న మేడవరపు చెరువు ఆక్రమణల చెరలో కుచించుకుపోతోంది. చెరువు అభివృద్ధి ఆలనాపాలనా కరువైంది. తూములు పాడైపోయాయి. ఆక్రమణలు తొలగించి నీటి సామర్థ్యం పెంచాలని రైతులు కోరుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ చెరువు సుమారు 336.50 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఎగువన ఉన్న చెరువులు, వాగులు వర్షాకాలంలో పొంగి ఆదనపు నీరు ఈ మేడవరపు చెరువుకు చేరుతుంది. ఈ చెరువు అదనపు నీరు ఎర్రకాల్వగా మారి ప్రవహిస్తుంది. చింతలపూడి మండలం నీటిపారుదల శాఖకు చెందిన 36 సాగునీటి చెరువుల్లో ఇది పెద్ద చెరువు. దీని దిగువన సుమారు వెయ్యి ఎకరాలు సాగులో ఉంది. వేసవిలో సైతం గతంలో ఈ చెరువులో నీరు సమృద్ధిగా ఉండేది. మత్స్యకారులు చేపలు, తామరకాయలు సేకరించి వాటిని అమ్ముకుని జీవనం పొందేవారు. నానాటికి ఈ చెరువు ఆక్రమణలకు గురవుతోంది. ఎర్రకాల్వ మరమ్మతుల సమయంలో ఈ చెరువు అలుగు ఎత్తు తగ్గించడంతో ఆక్రమణలు జోరయ్యాయి. సుమారు చెరువు లోపల 120 ఎకరాలకు పైగా ఆక్రమించి సాగు చేయడమే కాక కొందరు అమ్ముకుని, కొనుగోళ్లు అనధికారికంగా చేస్తున్నారు. చెరువు ఆక్రమణల వల్ల సాగునీరు తగ్గిపోవడంతో శివారు ఆయకట్టు రైతులు పొలాల్లో గొట్టపు బావులు వేసుకుని సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ చెరువుకు సాగునీటి సంఘం కమిటీ ఏర్పడింది. ఈ చెరువు ఆక్రమణలు, పూడికలు తొలగించి తూములకు మరమ్మతులు చేపడితే నీరు సమృద్ధిగా ఉండడమే కాకుండా దిగువన ఉన్న పొలాలకు రెండో పంటకు సాగునీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

అలుగు ఎత్తు పెంచాలి



మేడవరపు చెరువు పురాతనమైంది. వాగులు పొంగి ఈ చెరువులో ఒకప్పుడు సమృద్ధిగా నీరు ఉండేది. అలుగు ఎత్తు తగ్గించడంతో చెరువు ఆక్రమణల పాలైంది. రికార్డుల ప్రకారం చెరువు వైశాల్యం గుర్తించి కొలతలు జరిపించి ఆక్రమణలు తొలగించాలి. అలుగు ఎత్తు పెంచితే ఆక్రమణలు తొలగి చెరువు అంతేకాక నీరు సమృద్ధిగా ఉంటుంది. గొట్టపు బావులకు ఇచ్చే కరెంటు ఆదా అవుతుంది.

- ఆది సత్యనారాయణ, సాగునీటి సంఘం డైరెక్టర్, మేడవరపు చెరువు, ఎల్ఎన్‌పురం



పాడైన తూము



మంచినీటి కోసం ఆందోళన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచినీటి పథకం ద్వారా గోదావరి నీటిని అందించాలని కోరుతూ ఆదివారం రెడ్డిగణపవరంలో గ్రామస్తులు మంచినీటి పథకం ట్యాంక్ వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఐదారై రోజులుగా పథకం ద్వారా మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మాజీ ఎంపీటీసీ, కేపీఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మంచినీరు రావడంలేదని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే సమస్య తమ పరిధిలోని కాదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాక గ్రామస్తులు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారని వెంటనే మంచినీటి సమస్యను పరిష్కారించాలని కోరారు. పథకంలో పనిచేసే కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వేతనాలను ఇప్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీటీసీ పి.దుర్గారావు, వి.వెంణు, కె.అరుణ్, బి.మరియమ్మ, కె.బుచ్చమ్మ, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.



ఉపాధికి ఊతం..

పీఎంఈజీపీ యూనిట్ల లక్ష్యం 63 .. 50 యూనిట్లకు గ్రీన్‌సిగ్నల్

ఏలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగంతో దిక్కుతోచని యువతకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ) ఊతం ఇస్తోంది. రాజీలేకాన్న సంకల్ప బలం, కొంత అనుభవం పెట్టుబడిగా ముందుకు సాగితే ఉపాధి సునాయాసంగా పొందవచ్చు.

● జిల్లాలో పీఎంఈజీపీ కింద 2024-25 కార్యాచరణ ప్రకారం పరిశ్రమల కేంద్రం ద్వారా 63 యూనిట్లు మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 50 యూనిట్ల స్థాపనకు జిల్లాలో 18 బ్యాంకుల లు యువతకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. తాను ఎంచుకున్న రంగంలో యువత ఆత్మ విశ్వాసం అలవరుచుకుని యూనిట్ స్థాపన, అనుభవం, లక్ష్యం చేరుకునే మార్గాల్లో నిజాయతీ ఉంటే బ్యాంకులు ఉదారంగా యూనిట్ల స్థాపనకు ముందుకొస్తున్నాయి. 18 ఏళ్లు పైబడిన వారంతా ఈ పథకానికే అర్హులే. ఆదాయ పరిమితి లేదు.

● **అర్హతలు.. నిబంధనలు**

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాజెక్టు విలువ రూ.10 లక్షలు, సర్వీసింగ్ ప్రాజెక్టు విలువ రూ.5 లక్షలు దాటితే ఎనిమిదో తరగతి చదివి ఉండాలి. ఈ యూనిట్ విలువ గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు, సర్వీసింగ్ ప్రాజెక్టు అయితే రూ.20 లక్షల వరకు రుణం ఇస్తారు. ఉపాధి కల్పనలో ప్రతీ రూపాయి వ్యక్తి లక్షల స్థిరపెట్టుబడి పై కనీసం ఒక వ్యక్తికి ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. యూనిట్ల ప్రాజెక్టు విలువలో గరిష్ఠంగా 40 శాతం, సర్వీసింగ్ యూనిట్ల ప్రాజెక్టు విలువలో గరిష్ఠంగా 60 శాతం మించకూడదు.

● ఓసీ పురుషులకు పట్టణాల్లో 15 శాతం, గ్రామాల్లో 25 శాతం సబ్సిడీ ఇస్తారు. ఇందులో లబ్ధిదారుడి వాటా మొత్తంగా యూనిట్ విలువలో 10 శాతం ఉండాలి. ప్రత్యేక కేటగిరిలో మహిళలు, మైనార్టీ, మాజీ సైనికులకు పట్టణాల్లో 25 శాతం గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం సబ్సిడీ ఇస్తారు. 5 శాతం మాత్రమే లబ్ధిదారుని వాటా పరిమితి విధించారు.

● హోటళ్లు, మెస్, ఫ్లయాష్ బ్రిక్స్, మెడికల్ డయాగ్నోస్టిక్ సర్వీసెస్, జ్యూయలరీ వర్కు, టైలరింగ్, రెడీమేడ్ గార్మెంట్స్, ఫ్లోర్‌మిల్, దాల్‌మిల్, టాయ్స్ అండ్ డాల్ మేకింగ్, గిఫ్ట్ ఐటమ్స్ తయారీ,ఎంబ్రాయిడరీ, విగ్గుల తయారీ, వర్మికంపోస్టు, కొబ్బరిపీచు ఉత్పత్తులు, జీడిపప్పు ప్రాసెసింగ్, పౌల్ట్రీఫారం, డెయిరీ ఉత్పత్తులకు బాగా ఉపయోగంగా ఉంటాయి.

ఎంపికలో ప్రణాళిక అవసరం

జిల్లాలో పీఎంఈజీపీ యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు ఆసక్తి చూపుతున్నారు. యువత అందుబాటులో వనరులు న్నాయి. ఏదో యూనిట్ ద్వారా లక్ష్యాల సాధన, ఆత్మవిశ్వాసం, ఇతర ప్రయారిటీలను దృష్టిలో పెట్టుకుని ముందుకు రావాలి. ఆన్‌లైన్ దరఖాస్తులను సక్రమంగా చేయడం, పూర్తి వివరాలను నమోదు చేసుకుంటే బ్యాంకర్లు రుణాలను సకాలంలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. యూనిట్ స్థాపించిన ఐదేళ్లలో రుణం తీర్చాలి. సకాలంలో రీపేమెంట్ చేస్తే ఆదుపు వడ్డీభారం లు పడవు. ఈ స్కీమ్‌ను యువత సద్వినియోగించుకోవాలి.

- సుబ్రహ్మణ్యేశ్వరరావు, పరిశ్రమల కేంద్రం జీఎం

ఎమ్మెల్సీ పోలింగ్‌కు కసరత్తు

ఆరు జిల్లాల్లో 2 వేలకు పైగా ఎన్నికల విధుల్లో సిబ్బంది

ఈనెల 22న తుది విడత శిక్షణ



బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణలో పీవో, ఏపీవోలు(ఫైల్‌ఫొటో)

ఏలూరు,ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గడువు పది రోజులు లోపే ఉండటంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఒక విడత శిక్షణ పూర్తి కాగా 22న మరోసారి పీవో, ఏపీవోలు, ఇతర సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 27 ఉదయం 8 గంటల నుంచి 4 గంటలకు వరకు పోలింగ్ జరుగనున్నది. దాదాపుగా 2 వేల పైబడి అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవోతో పాటు, ఏపీవో మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉండనున్నారు. ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 456 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టనున్నారు. పోలింగ్ ముగిశాక పూర్తిస్థాయిలో కౌంటింగ్ ప్రక్రియపై యంత్రాంగం దృష్టి సారించనుంది. 456 పోలింగ్ కేంద్రాలకు ఈ సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం రిజర్వ్‌లో అధికారులు, సిబ్బంది కూడా ఎన్నికల విధులకు సిద్ధం అయ్యారు. ప్రతీ జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు 10 మంది జోనల్ ఆఫీసర్లు చొప్పున మండల స్థాయి లేదా, డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌లోని అధికారులు పనిచేస్తారు.

26న పోలింగ్ సామాగ్రి తరలింపు

జిల్లా కేంద్రాల్లో 26న ఉదయం పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది రూట్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బస్సుల్లో బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రితో తరలివెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేస్తారు. 27న తర్వాత పోలింగ్ పూర్తయ్యాక ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు భద్ర పరచనున్నారు. ఈ ప్రక్రియ అంతా పోలీస్ యంత్రాంగం ద్వారానే జరగనుంది.

ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటలనకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలతో తెలిపారు. ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకీ కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రవర్తనా నియామళిని పాటించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం 25వ తేదీ సాయంత్రం 4 గంటకల్లా ప్రచారానికి తెరపడనుంది. ఓట్లను అభ్యర్థించేటప్పుడు కుల,మతపరమైన భావాలు వ్యక్తం చేయరాదు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ఆరాధన ప్రదేశాలను వేదికగా ఉపయోగించకూడదు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగ్ పూర్తి కావడానికి 48 గంటల కాలంలో మీటింగ్‌లు నిర్వహించడం వంటివి చేయరాదు. సభ నిర్వహణపై ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.





హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

కాకినాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండోరోజు ఆదివారం టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. తొలుత ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 8-1తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చండీగర్, ఆర్ఎస్బీ ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ ముంబై 5-1 తేడాతో విజయం సాధించింది. అలాగే ఆర్ఎస్బీ సిమ్లా, ఆర్ఎస్బీ రాయ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ రాయ్ పూర్ జట్టు 6-2తేడాతో విజయం సాధించింది. చత్తీస్‌గడ్, గుజరాత్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌గడ్ జట్టు 13-0 తేడాతో గుజరాత్ జట్టుపై విజయం సాధించింది.మధ్యప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది. కేరళ, ఢిల్లీ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు 9-0 తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పాండిచ్చేరి, ఒడిశా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా జట్టు 6-0 తేడాతో విజయం సాధిం చింది. గోవా, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 18-0 తేడాతో గోవాపై విజయం సాధించింది. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

ఆర్చరీలో హంసినికి బంగారు పతకం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీపీసీ జూనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో విలువిద్య బాలికల వ్యక్తిగత విభాగంలో భారతీ విద్యాభవన్స్‌లో ప్లస్-2 చదువుతున్న మాదాల సూర్య హంసిని బంగారు పతకం సాధించింది. ఢిల్లీకి చెందిన కుమిత్ సనానిపై 143/141 స్కోర్‌తో బంగారు పతకం సాధించింది. హంసినిని ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, జిల్లా సెక్రటరీ జయరాజు, కోచ్ కమల్ కిషోర్ అభినందించారు.

ముక్కలేనిదే ఆదివారం చాలామందికి ముద్ద దిగదు.. అందుకే ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాలు కళకళలాడు తుంటాయి.. అయితే బర్డ్‌ఫ్లూ భయం కారణంగా కొన్ని రోజులుగా చికెన్ తినడం మానేశారు.. చికెన్ అమ్మకాలు కుదేలయ్యాయి.. షాపులు వెలవెలబోతున్నాయి. మాంసప్రియులు మటన్, చేపలు కొనేందుకు ఆసక్తి చూపడంతో వాటికి డిమాండ్ పెరిగిపోయింది.. చేపల మార్కెట్‌లు కిటకిటలాడాయి.. చికెన్ దుకాణాల్లో మటన్ అమ్మకాలు చేపట్టారు.. ఇదే అదనుగా వ్యాపారులు వాటి ధరలు కూడా పెంచేశారు.. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి..

చికెన్‌కు చిక్కులు



ద్వారకాతిరుమలలో ఖాళీగా చికెన్ దుకాణం

వెంటాడుతున్న బర్డ్‌ఫ్లూ భయాలు

ఆదివారం వెలవెలబోయిన దుకాణాలు
జోరుగా మటన్, చేపలు,రొయ్యల అమ్మకాలు
అమాంతం పెరిగిన డిమాండ్
ఎక్కడికక్కడ ధరలు పెంచేసిన వ్యాపారులు



రద్దీగా తాడేపల్లిగూడెం చేపల మార్కెట్

తాడేపల్లిగూడెం రూరల్/ తాడేపల్లిగూడెం అర్బన్/ ద్వారకా తిరుమల/గణపవరం/ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు జిల్లాలో చికెన్ విక్రయాలు తుడిచిపెట్టుకు పోయాయి. పది రోజులుగా బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ కొనడం, తినడం మానేయడంతో ఈ ఆదివారం వ్యాపారులే విక్రయాలు నిలుపుదల చేశారు. కొన్ని చోట్ల చికెన్ షాపుల్లో చేపలు విక్రయించారు.మటన్, చేపలకు డిమాండ్ పెరిగింది. చికెన్ విక్రయాలు సాధారణంగా ఆదివారం ప్రత్యేకించి పశ్చిమ ఉమ్మడి పశ్చిమలో పది టన్నుల వరకూ విక్రయాలు జరిగేవి. కానీ ఈ ఆదివారం విక్రయాలు టన్ను కూడా అమ్మలేకపోయారు. తాడేపల్లి గూడెం, తణుకు, భీమవరం, ఉంగు టూరు, ద్వారకాతిరుమల, గణపవరం తదితర ప్రాంతాల్లో చికెన్ షాపులే తెరవలేదు.

మటన్, చేపలు, రొయ్యల ధరలకు రెక్కలు

గతంలో కేజీ మటన్ రూ.800లకు విక్రయించగా తాజాగా వెయ్యి నుంచి రూ.1200 వరకూ విక్రయాలు చేశారు. చేపలు కేజీ రూ.130 ఉండేవి రూ.180కి పెంచారు. కేజీ రొయ్యలు రూ.250 నుంచి రూ.350కి అమ్మారు. ఈ ఆదివారం మటన్ విక్రయాలు గతంలో కంటే రెండు రెట్లు సాగించినట్టు వ్యాపారులు చెబుతున్నారు. చేపలు, రొయ్యల విక్రయాలు సాధారణం కంటే మరికాస్త పెరిగాయి. తాడేపల్లిగూడెంలో కేజీ మటన్ రూ.800 , బోన్‌లెస్ అయితే రూ. 900 ఉండగా ప్రస్తుతం కేజీ రూ.1000 చేసి అమ్మకాలు జరిపారు. బోన్‌లెస్ మటన్ అయితే రూ.1200 అమ్మారు. చేపలు సైజుని బట్టి కిలో రేట్లను పెట్టారు. మామూలు రకం చేప అయితే గత వారం రూ 150 ఉండగా ప్రస్తుత మార్కెట్‌లో రూ.180 వరుకూ అమ్మకాలు సాగించారు. పెద్ద సైజు చేపలు అయితే కేజీ రూ 200 వరుకూ అమ్మకాలు సాగించారు. రొయ్యల ధర గత వారం లో రూ.170 ఉండగా ప్రస్తుతం రూ.270 వరుకూ విక్రయాలు సాగించారు. రొయ్య సైజు పెద్దది అయితే రూ 300 లకు పైగా అమ్మకాలు జరిపారు. పీతలు కూడా ఇదే పరిస్థితి . మీడియం సైజు పీతలు కిలోకు సుమారు 7 పీతలు వస్తాయి . వీటి ధర గత వారం రూ.350 నుంచి రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.750 వరుకూ అమ్మకాలు సాగించారు. చిన్న సైజు పీతలయితే గత వారం రూ 250 ఉండగా ఈ వారం రూ.450 వరుకూ విక్రయాలు జరిపారు. ద్వారకాతిరుమలలో చికెన్‌సెంటర్లు ఆదివారం వెలవెల పోయాయి. ప్రత్యామ్నాయంగా స్థానికులు చేపలు, మటన్ కొను గోలుకు ఆసక్తి చూపారు. ఇక్కడ గత వారం కేజీ చేప ధర రూ.130 ఉంటే ప్రస్తుతం రూ.180కు అమ్మారు. గణపవరం మార్కెట్‌లో చేపలు కొనేందుకు వినియోగదారులు క్యూకట్టారు. చేపలు రిటైల్ రూ.150 కిలో ఉండగా ప్రస్తుతం కిలో రూ.170 వసూలు చేస్తున్నారు. ఆదివారం మాంసం ప్రియులతో ఏలూరు చేపల మార్కెట్ రద్దీగా మారింది. రోజువారి కన్నా మటన్ భారీగా కొనుగోళ్లు చేశారు. సాధారణంగా కిలో రూ.700 నుంచి రూ.800 ఉండే మటన్ ప్రస్తుతం రూ.వెయ్యికి పెంచేశారు. చేపలు కిలో రూ.140 నుంచి రూ.150 సాధారణ రోజుల్లో అమ్మేవారు. ప్రస్తుతం రూ.180 అమ్ముతున్నారు.



బాదంపూడిలో డ్రోన్ ద్వారా సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

రెడ్‌జోన్‌లో సోడియం హైపోక్లోరైడ్ పిచికారీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) :ఏలూరు జిల్లాలోని బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన ప్రాంతంలో ఆదివారం (రెడ్ జోన్)లో డ్రోన్ సాయంతో సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. రెడ్‌జోన్ ప్రాంతంలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బాదంపూడి పంచాయతీ కార్యదర్శి కాకర్ల గిరిధర్ తెలిపారు. డ్రోన్ ద్వారా పిచికారీని సర్పంచ్ కంకట పద్మలీల,కూటమి నాయకులు జామి రాంబాబు, వెలమాటి కాశీ కృష్ణ, ఏఎన్ఎంలు పర్యవేక్షించారు.



కొట్టుకువచ్చిన కోళ్లను ఖననం చేసిన పంచాయతీ సిబ్బంది

రేలంగి గోస్తనీలో కొట్టుకు వచ్చిన కోళ్లు

ఇరగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వైరస్ బారిన పడిన కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఆదివారం ఇరగవరం మండలం రేలంగి గోస్తనీ నదిలో చనిపోయిన కోళ్ళు కొట్టుకు రావడం స్థానికులను భయాందోళనకు గురి చేసింది. దీంతో స్థానికులు పంచాయతీ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. స్థానిక పశు సంవర్థకశాఖ సిబ్బంది సూచనలతో సుమారు 500 కోళ్లను గ్రామ శివారులో శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని పశుసంవర్థక శాఖ సిబ్బంది తెలిపారు.



విగ్రహాలను ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

కలవపూడిలో ఘనంగా ఉమా భీమేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కాళ్ళ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హరోం..హర అంటూ కలవపూడి గ్రామం ఆదివారం శివనామస్మరణతో మారుమోగింది. కాళ్ళ మండలం కలవపూడిలో ఉమాభీమేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో సుందరంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 21వ తేదీన ప్రతిష్ఠించబోయే రాతి విగ్రహాలను అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామంలోని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.యాగశాలలో జలాధివాసం, ధాన్యాధివాసం వంటి పూజలు నిర్వహించారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నూతన ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆమె రచనలు స్ఫూర్తిదాయకం : మాజీ ఎంపీ గంగరాజు

ఏలూరులో వేడుకగా ఓల్గాకు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం



ఓల్గాకు పురస్కారం అందిస్తున్న ఫౌండర్ మదుపల్లి మోహన గుప్తా, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తదితరులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తల రచనలు నదీ ప్రవాహాలు అని పోపూరి లలితకుమారి రచనలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ ప్రభావం చేస్తున్నాయని నరసాపురం మాజీ ఎంపీ, వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అందించే కృష్ణమూర్తి సాహిత్య పురస్కార మహోత్సవం ఆదివారం సాయంత్రం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్లో వేడుకగా జరిగింది. తెలుగు రచయిత్రి లలితకుమారి (ఓల్గా)కు 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారం అందజేశారు. జ్ఞాపిక, రూ.3 లక్షలు నగదు అందించారు. గుప్తా ఫౌండేషన్ ఫౌండర్ మదుపల్లి మోహన్ గుప్తా మాట్లాడుతూ సామాజిక, కళా సాంస్కృతిక, సాహిత్యార్చనలో తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరు వెంకన్నచెరువు స్మశాన వాటిక పునరుద్ధరణకు కోటి రూపాయలు అందజేశారు. శివ గోపాల్ లునాని, వాల్మీకి విజ్ఞాన కేంద్రం, పాఠశాల భోజన సహాయం కోసం రూ.46 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్, వంగాయి గూడెం గుడ్ సమరటిన్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ప్రొఫెసర్ చుండూరి మృణాలిని, చార్టెడ్ అకౌంటెంట్ సుబ్బారావు, గుప్తా ఫౌండేషన్ సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.





ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



వివరాలు చెప్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఇద్దరు దొంగలు అరెస్టు

నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ పాత నేరస్తులు... ప్రాంతాలు మారి, నివాసాలు మార్చి మోటారు సైకిళ్ళను తస్కరించి వాటితో చైన్ స్నాచింగ్ నేరానికి పాల్పడ్డారు. మొత్తం మీద పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వారిద్దని అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉన్నట్లు గుర్తించారు. కేసుల వివరాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. చింతలపూడి మండలం బోయిగూడెం గ్రామానికి చెందిన అక్కల రామ చంద్రరావు భీమడోలు మండలం సూరప్ప గూడెం గ్రామంలోని వెజ్జు బాలాజీకి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. జనవరి 28వ తేదీన ఆ పొలంలో ఉన్న షెడ్డులో తన పల్సర్ మోటారు సైకిల్ పెట్టి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లి ఈనెల 13వ తేదీన తిరిగి వచ్చి చూసేటప్పటికి షెడ్డు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. మోటారు సైకిల్ అపహరించుకుపోయారు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన ఏలూరు వంగాయి గూడేనికి చెందిన వాసిరాజు అలియాస్ సాంబశివరావు (40) ప్రస్తుతం ఇతను భీమడోలు మండల సూరప్ప గూడెంలో ఉంటున్నాడు. ఇతడిని అతని ఇంటి వద్దే అరెస్టు చేసి పల్సర్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనితో పాటే ఉన్న భీమడోలులోని గొలుసులగేటు రోడ్డులో నివాసం ఉంటున్న యర్రంశెట్టి పవన్‌కుమార్ అలియాస్ పాయాగాడు (25)ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు కలిసి ఈనెల 6వ తేదీన డిస్కవర్ మోటారు సైకిల్‌పై ఏలూరు వెళ్లి అక్కడ వన్‌టౌన్ పడమర వీధి పిలగల వీరమ్మ అనే వృద్ధురాలి మెడలో బంగారపు గొలుసు తెంపుకుని పారిపోయారు. వీరిని పూర్తిస్థాయిలో విచారించారు. ప్రధాన నిందితుడైన వాసిరాజుపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 దొంగతనం కేసులు ఉన్నాయని అతనిపై భీమడోలు పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉందన్నారు. వీరిద్దరు కలిసి ద్వారకాతిరుమల పరిధిలో ఒక మోటారు సైకిల్, భీమడోలు పరిధిలో మూడు మోటారు సైకిళ్ళను అపహరించారు. వారి నుంచి మొత్తం నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చైన్ స్నాచింగ్‌లో అపహరించిన గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు లక్షల 40 వేల రూపాయలకు తాకట్టు పెట్టినట్లుగా గుర్తించారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు మోటారు సైకిళ్ళ విలువల రెండు లక్షల 25 వేల రూపాయలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు. భీమడోలు హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, బాజీ, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

లారీపై టార్పాలిన్ కట్లు విప్పుతూ కుప్పకూలి డ్రైవర్ మృతి



పెదవేగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌కు ఉన్న కట్లు విప్పుతూ డ్రైవర్ మృతి చెందినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. కాకినాడ జిల్లా ఇంద్రపాలెంకు చెందిన పిల్లి నూకరాజు హైదరాబాద్ నుంచి పెదవేగి మండలం వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీకి ఖాళీ బ్రాందీ సీసాల లోడు లారీతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వచ్చాడు. ఖాళీ సీసాలను దించ డానికి లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌ను తొలగిస్తూ ఒక్కసారిగా లారీపై కుప్పకూలిపోయాడు. అక్కడి పనిచేసే సిబ్బంది గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీ లించగా అప్పటికే నూకరాజు (55) మృతి చెందాడని చెప్పారు. నూకరాజు మృతిపై అతని బంధువులకు సమాచారం అందించామని వారు వచ్చిన తరువాత పంచనామా నిర్వహించి, శవ పరీక్షకు తరలిస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

క్రైమ్ కార్నర్

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి తన తల్లిని తీసుకువెళ్ళి చూపించి తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఆకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై పక్కగా వచ్చి తల్లి మెడలోని బంగారపు గొలుసును తెంపుకుని అతివేగంగా వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు ఆదివారం ఉదయం కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామానికి చెందిన రుంజల వెంకటేష్ తన తల్లి నిర్మల (62)ను ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి ఈనెల 15వ తేదీ రాత్రి తీసుకువచ్చి 10 గంటల ప్రాంతంలో మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులో పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో వెనుక నుంచి ఇద్దరు యువకులు యునికార్న్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆకస్మాత్తుగా నిర్మల మెడలోని మూడు కాసులు బంగారపు గొలుసును తెంపుకుని అతి వేగంగా వెళ్ళిపోయారు. బాధితులు ఆదివారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుకు వృద్ధురాలి మృతి

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామానికి చెందిన వర్ధనపు పుష్ప (55) పాటు కాటుకు గురై మృతి చెందింది. ఇంట్లో వంట చేసుకునే సమయంలో పాము ఇంట్లోకి చేరి ఆమెను కాటు వేసింది. వెంటనే ఆమెను నరసాపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించి వైద్యం చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

బావాయిపాలెంలో యువకుడి దారుణ హత్య

చేయి నరికి తీసుకువెళ్లిన దుండగులు



ఏసు వివాహం ఫొటో



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్ సీఐ సుభాష్ →

నిడమర్రు ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):ప్రేమించి పెళ్లిచేసుకొన్న భర్తను విగతజీవిగా చూసి ఆ భార్య పెడుతున్న కన్నీరును ఆపడం ఎవరితరం కాలేదు. ఏడడుగులతో మొదలైన బంధం రెండేళ్ల కూడా సాగకుండానే కొండెక్కిపోయింది.బతుకుదెరువు కోసం రొయ్య చెరువుపై పనికిపోయిన తన మనవడు తెల్లారేసరికి శవంగా తిరిగిరావడం చూసి ఆ అమ్మమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది. నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామ శివారు ప్రాంతం చినకాపవరం పంటకాల్వ వద్ద దుండగులు ఒకరిని హత్యచేసి పరాయయ్యారు. బావాయిపాలెం గ్రామానికి చెందిన మజ్జి ఏసును (26) శనివారం అర్థరాత్రి దాటాక దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. మృతుని చెయ్యి పట్టుకొని పోయారు. ఏసు భార్య శ్రీవల్లి 8 నెలల గర్భిణీ. పురుడు కోసం పుట్టింటికి వెళ్లింది. ఏసు తండ్రి ప్రసాద్ చాన్నాళ్ల క్రితం చనిపోగా తల్లి దుబాయ్‌లో పనిచేస్తున్నది. అమ్మమ్మతో పాటు ఏసు దంపతులు కలసి జీవిస్తున్నారు. హత్యకు గురైన ఏసు శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి..అదే సామాజిక వర్గానికి చెందిన శ్రీవల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ హత్యకు కారణాలు తెలియలేదు. పాతకక్షలా లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఒకరు కన్నా ఎక్కువ మంది ఇందులో ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందిన వెంటనే నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీ సుభాష్, ఎస్.ఐ వీరప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. పోలీస్ డాగ్ మృతుడు ఇంటి పరిస రాలలో సంచరించింది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ క్లూస్‌టీమ్ తోనూ, సీఐ ఎస్ఐలతో విచారించారు. సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.



ఏసు నివాసం ఉంటున్న ఇల్లు

పంట కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

కైకలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పంటకాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తెలి పారు. ఆదివారం శ్యామలాంబపురంలో పోల్ రాజ్ కాల్వలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి నట్లు తెలిపారు. వీఆర్‌ఏ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమా ర్టం కోసం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిస్తే కైకలూరు పోలీసుల సెల్ నంబర్లు 94407 96434, 94407 96433లకు సమాచారం అందించాలని కోరారు.

సీఆర్ఆర్‌లో హీమోఫీలియాపై అవగాహన

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : రక్తసంబంధిత వ్యాధి హీమోఫీలియాపై ఆదివారం స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో అవగాహన సదస్సు జరిగింది. హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి బాధితులు, వైద్య నిపుణులు హాజరయ్యారు. మంగళగిరి 'ఎయిమ్స్' హాస్పిటల్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హీమోథెరపీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.ఎస్. చైతన్య కుమార్ హీమోఫీలియాపై అవగాహన కల్పించారు. హీమోఫీలియా బాధితులకు మెరుగైన జీవితాన్ని అందించడానికి చాప్టర్ ద్వారా చేస్తున్న కృషిని తెలిపారు. ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోటి సుధాకర్, సీఆర్ఆర్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ రామరాజు, విశ్వేశ్వరరావు, సరళ, తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఆదుకోవాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సుమన్, ఉపాధ్యక్షుడు ఘంటా సంపత్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం ఉద్యోగ భద్రతపై చర్చించారు. ఇటీవల మంత్రివర్గంలో ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వంపై గంపెడు ఆశలు ఉన్నాయని, ఆ ఆశలను నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు నాగ భూషణం, మహిళా విభాగం కార్యదర్శి సుశీల, వి.రమేష్, పి.కిషోర్‌కుమార్, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది

పెదవేగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. పుస్తక పఠనంతో అంతర్లీనంగా దాగి ఉన్న కళలు వెలికివస్తాయన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని అన్నారు.

135 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : రామకోటి ప్రాంగణంలో ఆదివారం లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వేమగిరికి చెందిన యోగానంద నేత్ర వైద్యశాల నిపుణులు 135మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా 32 మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించి వారికి సబ్సిడీపై కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మరడాని రంగారావు, లయన్స్ నాయకులు బి.మురళీ, పి.పండరీనాథ్, బి.సురేష్‌కుమార్, చెన్నా వెంకట్రామయ్య, విఠల్ సేవలందించారు.

వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు

కామవరపుకోట/ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. తొలుత స్వామికి లలితా శ్రీ పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు.ఏలూరు సత్రంపాడులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. పవరుపేట, పత్తేబాద, దక్షిణపువీధి, మినీ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లోని గణనాథుడి ఆలయాల్లో వద్ద సంకటహర చతుర్థి పూజలు జరిపించారు.

ఆత్మహత్యకు కారకులైన వారిపై కేసు

భీమడోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామం చెందిన అడపా వీరరాఘ వేంద్ర కుమార్(19) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించాడు. యువతి బంధువులైన సురేష్, సాయి, నాగు అనే వ్యక్తులు చంపుతామని బెదిరించడంతో రాఘవేంద్ర కుమార్ జనవరి 20న పురుగు మందు తాగాడు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు 21న మృతి చెందాడు. యువకుడి మృతికి కారకులైన సురేష్, సాయి, నాగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'ఎల్‌పీజీని వాడండి- పర్యావరణాన్ని కాపాడండి'

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : గ్రీన్, క్లీన్ ఎనర్జీ ద్వారా పరిశుభ్రమైన పర్యావరణం అనే నినాదంతో ఆదివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌పిజిని వాడండి- పర్యావరణాన్ని కాపాడండి, గ్లోబల్ సేవ్ ఆయిల్ - సేవ్ ఎనర్జీ అనే నినాదాలతో కాలినడకన అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా జిల్లా ఆస్పత్రి వరకు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖపట్నం ఐఓసిఎల్ ఎల్పీజీ సేల్స్ జనరల్ మేనేజర్ రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్య క్రమంలో డీఎస్‌వో సత్యనారాయణరాజు, ఎల్‌పీజీ సేల్స్ మేనేజర్ ఎం.వి.రామ్ ప్రసాద్, సహాయ పౌరసరఫరాల శాఖాధికారి వై.ప్రతాప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన చినవెంకన్న క్షేత్రం


ఆలయ ఆవరణలో భక్తులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవు రోజుకావడంతో ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయానికి వచ్చిన వారంతా మొక్కుబడులు తీర్చుకునేందుకు స్వామి దర్శనానికి బారులు తీరారు. శ్రీవారిని దర్శించుకుందుకు భక్తులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. దర్శనానంతరం తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. దాదాపు పదివేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

ఘనంగా అన్నప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులకు ఆలయ నిర్వాహకులు ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రథ సప్తమి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది మంచెనపల్లి సూర్యనారాయణ, శ్రీనివాసరావుల బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ రెడ్డి, ఆలయ ఈవో స్నేహా, ఆలయ కమిటీ సభ్యులు తోట రమేష్ కుమార్, యర్రంశెట్టి గంగాధరరావు, భారతి శ్రీనివాసరావు, ఘంటా రాంబాబు, నర్రా లక్ష్మణ, మట్టా జగదీష్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వచ్ఛందంగా మూసివేస్తున్న చికెన్ దుకాణాలు

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ వైరస్ ప్రజలకు సోకకుండా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా జంగారెడ్డిగూడెం పట్టణంలోని చికెన్ షాపులను వారం రోజుల పాటు స్వచ్ఛందంగా మూసివేస్తున్నట్లు చికెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణాధ్యక్షుడు యర్రా అప్పారావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వారం రోజుల పాటు పట్టణంలో అన్ని దుకాణాలను మూసివేసినట్టు తెలిపారు.

బీజేపీ ఉంగుటూరు మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ఉంగుటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు బి.జే.పి. నూతన మండల కార్యవర్గ అధ్యక్షునిగా వంజరపు దుర్గారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి నాయకత్వంలో జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స రామచంద్రరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కాకిలేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శులుగా గజ్జెల నమ్మారావు, అడపా ఇంద్రేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నల్లజర్ల రామారావు, అడపా పెంటయ్య, కొక్కొండ శిరీష, గాది రామారావు, ఉదరకొంగ జానకమ్మ, కార్యదర్శులుగా మల్లెల తులసి, మొగులూరి జేజుబాబు, మద్దాల రాణి, కుంపట్ల దుర్గా ప్రసాద్, తాడిశెట్టి వీరబాబుమెల్లిపాక ప్రసాద్, కోశాధికారిగా కొరిపల్లి అప్పారావులు ఎన్నికయ్యారు. మండల మోర్చా చిట్నీడి అనంత లక్ష్మి, యువమోర్చా అధ్యక్షునిగా కొత్తపల్లి ఫణీంద్ర రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షునిగా రుద్రరాజు శ్రీనివాసరాజు, ఓ.బి.సి.మోర్చా అధ్యక్షునిగా టేకి కొండల రావు, దళిత మోర్చా అధ్యక్షునిగా గంజి మోహనరావు,మైనారిటి అధ్యక్షునిగా షేక్ భాషాలు ఎన్నికయ్యారు.

మామిడికి మంగు తెగులు బెడద..

ఈ ఎడాదైనా మామిడికి మంచి రోజులు వస్తాయేమోనని ఎదురు చూస్తున్న రైతులకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. మామిడి దిగుబడులపై ఆశలు పెంచుకున్న రైతుకు వాతావరణ మార్పులతో నిరాశే ఎదురవుతోంది. పూత, పిందె వచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే పూత ఆలస్యమవ్వడంతో పాటు ఇప్పుడు పిందెలపై కూడా మంచు ప్రభావం చూపడంతో కాయలు పిందె దశలోనే రాలిపోవడం, తెగుళ్లకు గురవ్వడం, అధిక మొత్తంలో పురుగు మందులు వాడాల్సి రావడంతో రైతులు నష్టపోతున్నారు. మంగు వల్ల తోటలు దెబ్బతినడంతో పాటు అధిక మొత్తంలో ఖర్చు పెరగడంతో మామిడి రైతులు దిగుబడులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులకు సబ్సిడీపై పురుగు మందులు సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

- లింగపాలెం(ఆంధ్రజ్యోతి)





1974-75లో టెన్త్ చదివిన పెదపాడు పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో


1999-20లో పోతునూరులో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పెదపాడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పెదపాడు జడ్పీ హైస్కూల్లో 1974-75 నాటి టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. టెన్త్ పూర్తి చేసుకుని 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక చోటకు చేరి చిన్ననాటి తీపిగుర్తులను నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపిన అనంతరం వీడ్కోలు పలికారు. పూర్వ విద్యార్థులు కె.ఆర్.కె.ప్రసాద్, వల్లూరి వెంకట కృష్ణయ్య, కె.శివ ప్రసాద్, కామేశ్వరి, మాగంటి ప్రసాద్, దావాల వెంకటేశ్వరరావు, రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

1977-82 పూర్వ విద్యార్థులు...

చింతలపూడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవాపురం జడ్పీ హైస్కూల్లో చదివిన 1977-82 చెందిన పూర్వ విద్యార్థులు తొలిసారిగా ఆదివారం హైస్కూల్ ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బెంగళూరు, హైదరాబాదు, విశాఖ వంటి దూర ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న, నివసిస్తున్న వారంతా ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులు చుండూరి చిన్నకృష్ణారావు, చిమ్మపూడి విశ్వ సుందరం, నల్లాన్ చక్రవర్తుల తిరువెంగళాచార్యులు, బి.ప్రవీణ్ రాయ్‌లను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుధాకర్, పలువురు పూర్వ విద్యార్థులు నిర్వాహకులుగా పర్యవేక్షించారు.

పోతునూరులో చిననాటి జ్ఞాపకాలు...

దెందులూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులంతా 25 ఏళ్ల తరువాత ఒక చోటకు చేరి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకోవడం ఆనందంగా ఉందని పోతునూరు వైసీపీ జిల్లా కార్యదర్శి డీఆర్క్ చౌదరి అన్నారు. ఆదివారం దెందులూరు మండలం పోతునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-20 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి సంఘ జిల్లా నాయకులు ఏసు బాబు, శివకృష్ణ వీర్రాజులు మాట్లాడుతూ తాము చదివిన హైస్కూల్ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. అనంతరం విద్య చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.


రాఘవాపురం జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


ధర్మాజీగూడెంలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా


కె.కోటలో నాయకుల ప్రచారం

రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు

పట్ట భద్రులు మద్దతు పలకాలని విజ్ఞప్తి

లింగపాలెం/కామవరపుకోట/భీమడోలు, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరంను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నాయకులను కోరారు. మండలంలోని ధర్మాజీ గూడెంలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పట్టభద్రులను కలిసి గ్రాడ్యుయేట్లను ఓట్లు అభ్యర్థించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గరిమళ్ల చలపతిరావు, గారపాటి బుజ్జయ్య, పి.శ్రీనివాసరావు, ఆర్.చక్ర ధరరావు, సి.హెచ్. నాగబాబు, సి.హెచ్.రామ్మోహన్‌రావు, మల్లికార్జునరావు, ప్రసాద్, రాధాకృష్ణ పాల్గొన్నారు. కామ వరపుకోట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం టీడీపీ నాయకులు పట్టభద్రుల నివాసాలకు వెళ్ళి బ్రోచర్లు అందచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని టీడీపీ నాయకులు గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, యలమర్తి రాంబాబులు కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు భీమడోలు మండలం సూరప్పగూడెంలో ప్రచారం నిర్వహించారు. రాజశేఖరంను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రులంతా రాజశేఖర్‌కు మద్దతు పల కాలని కోరారు. ఆయనతో పాటు ఉంగుటూరు నియో జకవర్గ పార్టీ పరిశీలనకులు వీఎస్ఎస్ మూర్తి, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన అవసరం : సీఐ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలున్నాయని, వాటి గురించి తెలుసుకోవాలని ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వర రావు అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, మహిళా ఎస్ఐ కాంతిప్రియ వారి సిబ్బంది త్రి టౌన్ పోలీసులు కలిసి ఏలూరు మెయిన్ బైపాస్ వట్లూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రి టౌన్ ఎస్ఐ వి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవాళ్లు 112కు కాల్ చేస్తే పోలీసులు సాయం చేస్తారని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు, బాల్య వివాహల నిర్మూలనకు 1098కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఏలూరు జిల్లా పోలీసులకు 95503 51100 కు సమాచారం అందించాలన్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్మశాన వాటిక వివాదంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు


ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు వినతి

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని రామచంద్రాపురం సమీపంలో ఉన్న పాకనాటికుంట చెరువు వద్ద ఉన్న స్మశాన వాటిక వివాదంపై స్థానికులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను ఆశ్రయించారు. అభివద్ధి పనులను కొందరు అడ్డుకుంటున్నారని రామచంద్రాపురం ప్రజలు ఎమ్మెల్యేను ఆది వారం కలిసి ఫిర్యాదు చేశారు. గత వందేళ్లుగా అక్కడ శ్మశాన వాటిక ఉందని హిందూ, క్రైస్తవులంతా ఆ శ్మశాన వాటికను ఉపయోగిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలి పారు. శ్మశానం దగ్గరలో నివాసం ఉండే ప్రజలు పను లను అడ్డుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ స్పందిస్తూ తానే స్వయంగా జంగారెడ్డి గూడెం వచ్చి అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిమి సత్తిపండు, పరిమి ధర్మరాజు, కొండ్రెడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల జాతర

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : కామవరంలోని గద్దె రాజులు, దుర్గాదేవి, గుబ్బల మంగమ్మ తల్లి, నాగదుర్గాదేవి అమ్మవార్ల గిరిజన జాతర మహోత్సవం ఆఖరి రోజు ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు జాతరలో ఒకరికొకరు తారసపడి కరచాలనం చేసుకుని పలకరించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా స్వాగతం పలికి అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఆదివాసీ సంరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కారం సీతారామన్నదొర అమ్మవార్లను దర్శించుకుని సారెను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ ఉత్సవాల్లో నాయకులు కారం గంగాధరరావు, మొడియం రమేష్ బాబు, వర్స పుల్లారావు, మన్యం పులి, తెల్లం రమేష్, కె.శివశంకర ప్రసాద్, చిన్నాబ్బాయి దొర, కె.సత్తిరెడ్డి పాల్గొన్నారు.


కరచాలనం చేసుకుంటున్న ఇద్దరు బాలరాజులు

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యానారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఈవో తెలిపారు.


దాతలకు బాండు అందజేస్తున్న ఆలయ అధికారి

చిన వెంకన్న ఆలయానికి విరాళం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయంలో నిర్వహించే రెండు పథకాలకు ఓ కుటుంబం ఆదివారం రూ.7.21 లక్షలను విరాళంగా అందజేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన బొప్పరపు వెంకట లోహిత్ నిత్యాన్నదానానికి రూ.5 లక్షలు, గోసంరక్షణకు మరో రూ.2.21 లక్షలు వెరసి రూ.7.21 లక్షలను ఆలయ కార్యాలయంలో జమచేయగా అధికారులు వారికి విరాళం బాండును అందించారు.


బిల్డింగ్ మెటీరియల్ వేయిస్తున్న త్రిమూర్తులు

గొయ్యిని పూడ్పించిన వ్యాపారి త్రిమూర్తులు

నిడమర్రు ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : నిడమర్రు మండలం భువ్వనపల్లిలోని ఆకివీడు వెళ్లే అప్రోచ్ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యిని పాములపర్తి త్రిమూర్తులు పూడ్పించారు. ఈ గొయ్యిని పూడ్చాలని రోడ్లు భవనాల శాఖకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో సమస్యను గుర్తించిన స్థానిక కూరగాయల షాపు యజమాని త్రిమూర్తులు బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను తెచ్చి పూడ్పించారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారమవ్వడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రామాలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ

చింతలపూడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రగడవరం గ్రామంలో రామాలయంలో కోదండ రామయ్య, సీతమ్మ తల్లి విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఈ వేడుకలో గ్రామస్థులంతా పాల్గొని పొంగళ్ళు సమర్పించి పూజలు జరిపారు. కూటమి నాయకులు జె. ముత్తారెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, టి.చంద్రశేకర్‌రెడ్డి, కొప్పెర్ల నాగరాజు పాల్గొన్నారు.


రాజబాబు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న వనిత

రాజబాబు పార్థివ దేహానికి నివాళి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వైసిపి సీనియర్ నేత, ద్వారకాతిరుమల మండలం సిహెచ్ పోతేపల్లికి చెందిన చెలికాని రాజమోహనరావు (రాజ బాబు) శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. స్వగ్రామానికి వచ్చిన ఆయన పార్థివ దేహానికి ఆదివారం మాజీ మంత్రి తానేటి వనిత, తూర్పు గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలరావు, జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్, మాజీ ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంపిపి బొండాడ మోహినీ వెంకన్నబాబు, ఘంటా ప్రసాద్ రావు, అలాగే పలువురు పార్టీనేతలు, పార్టీ నేతలు నివాళులర్పించారు.

అనసూయమ్మ మృతికి సంతాపం

కామవరపుకోట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : తడికలపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు బొప్పన అంజయ్య మాతృమూర్తి అనసూయమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆదివారం వారి నివాసానికి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ వెళ్ళి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల్లో పారిశుధ్యం

కె.జ్యోతి, ఎంపీడీవో, బుట్టాయగూడెం



● చెత్త సేకరణ పనులు ఎలా జరుగుతున్నాయి?
గ్రామాల్లో చెత్త వేసే ప్రదేశాలను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో గుర్తించి శుభ్రం చేయడం ప్రారంభించాం. ప్రజలు కూడా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలి.

● సంపద కేంద్రాల పనితీరు ఎలా ఉంది?
చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నాం. ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నాం. ఇంటింటికి తిరిగి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నాం.

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎలా జరుగుతోంది?
ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ విషయాన్ని ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరిస్తున్నాం.

● చెత్త సేకరణకు చేపట్టిన చర్యలేంటి?
ప్రజలకు తడి-పొడి చెత్తలపై అవగాహన కల్పించడమేకాకుండా రెండు రకాల డబ్బాలను ఇస్తున్నాం. తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నాం..

- బుట్టాయగూడెం

వెదురు కలప పట్టివేత

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : మూడు మోటార్ సైకిళ్లపై రాత్రి సమయంలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న వెదురు కలపను ముంజులూరు గ్రామ శివారులో పట్టుకున్నట్లు సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ తెలిపారు. పట్టుకున్న కలపను కన్నాపురం రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్.నవతేజ, ప్రసాద్, తదిరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : అంతర్వేదిగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు పూర్తిగా కాలిపోవడంతో బాధితుడైన చోడెం రాంపండు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఆదివారం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రాంపండు కుటుంబానికి సరుకులు, 10 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరాజు, నాయుడు, సత్యన్నారాయణరాజు, చోడెం రాజు కూటమి నాయకులు పాల్గొన్నారు. సీపీఎం మండల కమిటీ తరపున నాయకులు టి.రామకృష్ణ, పి.నాగేశ్వరరావు, ఉడతా వెంకటేష్‌లు బియ్యం, 5 వేలు నగదు అందజేయగా టీడీపీ నాయకుడు ఆంద్రూ శ్యాంకుమార్ నిత్యవసర సరుకులను అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పంటలో తెగుళ్ల వల్ల నష్టపోయిన అపరాల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక అన్నేభవనంలో ఆయన మాటాడుతూ పెసర, మినుము పంటలకు తెగుళ్లు సోకడంతో పంటలు రైతులు నష్టపోయారని అన్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని పంటల్లో నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని కోరారు.

పరిష్కార వేదిక నేడు రద్దు

పెదపాడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తూర్పు, పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం 17వ తేదీన జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు పెదపాడు తహసీల్దారు కృష్ణజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.మండలంలోని ప్రజలంతా దీనిని గమనించాలని కోరారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి) : ఏపిగుంట పంచాయతీలోని సర్వే నెంబరు 500లో సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.వి.ఎస్.రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎంతో కాలంగా సాగులో ఉన్న రైతుల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదపాడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని హోసన్నా మందిరం సమీపంలో ఈనెల 13వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడి పోవడంతో అతడిని 108 వాహనంలో ఏలూ రు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పెదపాడు పోలీస్ స్టేషన్ లేదా 9440796637 నెంబరులో తెలియజేయాలని కోరారు.

వేడుకగా అమ్మవార్ల జాతర

భీమడోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులో ఆదివారం గ్రామ దేవతల జాతర ఘనంగా జరిగింది. గంగానమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు సారె సమర్పించారు. ప్రజలంతా కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

కుంగుతున్న బీటీ రోడ్డు



పగుళ్లతో కుంగిన శాంతినగరం బీటీ రోడ్డు

కలిదిండి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వైసీపీ హయాంలో రూ. నాలుగు కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు పగుళ్లు ఏర్పడి కుంగుతోంది. పలుచోట్ల రోడ్డు గ్రావెల్ గుట్టలుగా విరిగి అండలు కాల్వలో పడడంతో పంట కాల్వ పూడుకుపోతోంది. బీటీ రోడ్డుపై తారు వేయకుండా జాప్యం చేయడంతో సగానికి పగుళ్లు ఏర్పడి కుంగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు నిర్మాణం కోసం శాంతి నగరం, పెదలంక గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. పంట కాల్వకు రిటైనింగ్ వాల్ నిర్మించిన తర్వాత రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, అందుకు విరుద్ధంగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్లే కుంగిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పంట కాల్వ వెంబడి రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేసి బీటీ గ్రావెల్ రోడ్డుపై తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు. 'గత ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో బీటీ గ్రావెల్ రోడ్డుపై తారు రోడ్డు పనులను కాంట్రాక్టర్ నిలుపుదల చేశారు. నిధులు మంజూరు కాగానే బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తా'మని పంచాయతీరాజ్ డీఈఈ లీలా మోహన్ తెలిపారు.

యువకుడిపై కర్రతో దాడి

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తన సోదరితో వివాహేతర సంబంధం వద్దని వారించిన ఆమె తమ్ముడిపై ఒక యువకుడు కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామానికి చెందిన యువకుడు శింగరాయపాలెంలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని సోదరి భర్తతో గొడవ పెట్టుకుని కొంతకాలం నుంచి పుట్టింటి వద్దే ఉంటున్నది. ఇటీవల ముదినేపల్లికి చెందిన రాజాతో వివాహేతర సంబంధం ఏర్పడింది. శనివారం సాయంత్రం రంగాపురం వద్ద వారిద్దరూ కనిపించడంతో ఆమె సోదరుడు గట్టిగా మందలించాడు. ఇద్దరి మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారితీయగా రాజా దగ్గరలోని కర్ర తీసుకుని తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. క్షతగాత్రుడని వెంటనే అతడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

పంట కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

కైకలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పంటకాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆదివారం శ్యామలాంబపురంలో పోల్ రాజ్ కాల్వలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిస్తే కైకలూరు పోలీసుల సెల్ నంబర్లు 94407 96434, 94407 96433లకు సమాచారం అందించాలని కోరారు.

బావాయిపాలెంలో యువకుడి దారుణ హత్య

చేయి నరికి తీసుకువెళ్లిన దుండగులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్ సీఐ సుభాష్

నిడమర్రు ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లిచేసుకొన్న భర్తను విగతజీవిగా చూసి ఆ భార్య పెడుతున్న కన్నీరును ఆపడం ఎవరితరం కాలేదు. ఏడడుగులతో మొదలైన బంధం రెండేళ్లు కూడా సాగకుండానే కొండెక్కిపోయింది. బతుకుదెరువు కోసం రొయ్య చెరువుపై పనికిపోయిన తన మనవడు తెల్లారేసరికి శవంగా తిరిగిరావడం చూసి ఆ అమ్మమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది. నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామ శివారు ప్రాంతం చినకాపవరం పంటకాల్వ వద్ద దుండగులు ఒకరిని హత్యచేసి పరాయయ్యారు. బావాయిపాలెం గ్రామానికి చెందిన మజ్జి ఏసును (26) శనివారం అర్ధరాత్రి దాటాక దుండగులు కిరాతకంగా హత్య చేశారు. మృతుని చెయ్యి పట్టుకొని పోయారు. ఏసు భార్య శ్రీవల్లి 8 నెలల గర్భిణి. పురుడు కోసం పుట్టింటికి వెళ్లింది. ఏసు తండ్రి ప్రసాద్ చాన్నాళ్ల క్రితం చనిపోగా తల్లి దుబాయ్‌లో పనిచేస్తున్నది. అమ్మమ్మతో పాటు ఏసు దంపతులు కలసి జీవిస్తున్నారు. హత్యకు గురైన ఏసు శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి..అదే సామాజిక వర్గానికి చెందిన శ్రీవల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ హత్యకు కారణాలు తెలియలేదు. పాతకక్షలా లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఒకరు కన్నా ఎక్కువ మంది ఇందులో ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందిన వెంటనే నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీ సుభాష్, ఎస్.ఐ వీరప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. పోలీస్ డాగ్ మృతుడు ఇంటి పరిసరాలలో సంచరించింది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ క్లూస్‌టీమ్ తోనూ, సీఐ ఎస్ఐలతో విచారించారు. సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.



వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఇద్దరు దొంగల అరెస్టు

నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ పాత నేరస్తులు... ప్రాంతాలు మారి, నివాసాలు మార్చి మోటారు సైకిళ్ళను తస్కరించి వాటితో చైన్ స్నాచింగ్ నేరానికి పాల్పడ్డారు. మొత్తం మీద పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వారిద్దని అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉన్నట్లు గుర్తించారు. కేసుల వివరాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. చింతలపూడి మండలం బోయిగూడెం గ్రామానికి చెందిన అక్కల రామ చంద్రరావు భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామం లోని వెజ్జు బాలాజీకి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. జనవరి 28వ తేదీన ఆ పొలంలో ఉన్న షెడ్డులో తన పల్సర్ మోటారు సైకిల్ పెట్టి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లి ఈనెల 13వ తేదీన తిరిగి వచ్చి చూసేటప్పటికి షెడ్డు తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. మోటారు సైకిల్ అపహరించుకుపోయారు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన ఏలూరు వంగాయి గూడేనికి చెందిన వాసిరాజు అలియాస్ సాంబశివరావు (40) ప్రస్తుతం ఇతను భీమడోలు మండల సూరప్ప గూడెంలో ఉంటున్నాడు. ఇతడిని అతని ఇంటి వద్దే అరెస్టు చేసి పల్సర్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనితో పాటే ఉన్న భీమడోలులోని గొలుసులగేటు రోడ్డులో నివాసం ఉంటున్న యర్రంశెట్టి పవన్‌కుమార్ అలియాస్ పాయాగాడు (25)ను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు కలిసి ఈనెల 6వ తేదీన డిస్కవర్ మోటారు సైకిల్‌పై ఏలూరు వెళ్లి అక్కడ వన్‌టౌన్ పడమర వీధి పిలగల వీరమ్మ అనే వృదురాలి మెడలో బంగారపు గొలుసు తెంచుకుని పారిపోయారు. వీరిని పూర్తిస్థాయిలో విచారించారు. ప్రధాన నిందితుడైన వాసిరాజుపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 దొంగతనం కేసులు ఉన్నాయని అతనిపై భీమడోలు పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉందన్నారు. వీరిద్దరు కలిసి ద్వారకాతిరుమల పరిధిలో ఒక మోటారు సైకిల్, భీమడోలు పరిధిలో మూడు మోటారు సైకిళ్ళను అపహరించారు. వారి నుంచి మొత్తం నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చైన్ స్నా చింగ్‌లో అపహరించిన గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు లక్షల 40 వేల రూపాయలకు తాకట్టు పెట్టినట్లుగా గుర్తించారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు మోటారు సైకిళ్ళ విలువల రెండు లక్షల 25 వేల రూపా యలు ఉంటా యని డీఎస్పీ తెలిపారు. భీమడోలు హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, బాజీ, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

ప్రమాదకరంగా న్యూ వైవాక ఛానల్ వంతెన



పునాదులు బీటలు వారి కుంగుతున్న వంతెన

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌వీకే ఆర్ అండ్ బీ రోడ్డులో ముదినేపల్లి మండలం దేవపూడి - ప్రొద్దువాక గ్రామాల మధ్య వైవాక న్యూ ఛానల్ వంతెన వద్ద ప్రమాదస్థితి నెలకొంది. వంతెనకు ఇరువైపులా రోడ్లు ఎత్తుగా ఉండడం వంతెన పల్లంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. వంతెన నిర్మించిన సమయంలో వేసిన శ్లాబుపై తిరిగి ఎత్తు పెంచేందుకు రోడ్డును నిర్మించకపోవడంతో రోడ్ల నిర్మాణానికి సమానంగా వంతెన ఎత్తు పెరగలేదు. ఇటీవల ఆక్వా ఉత్పత్తులు, మేతతో వెళ్లే లోడు లారీల వల్ల వంతెన కుంగుతోంది. వంతెన పునాదులు బీటలు వారుతున్నాయి. రక్షణ గోడలు కూలిపోతున్నాయి. వంతెనపై రోడ్డు నిర్మిస్తే బరువును మోసే సామర్థ్యం లేదంటున్నారు అధికారులు. శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ వంతెనను అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కలిదిండి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు పంచాయతీ పరిధి బొబ్బిలి గూడేనికి చెందిన అగ్ని ప్రమాద బాధితులు గంజాల మల్లయ్యస్వామి కుటుంబసభ్యులకు ఆదివారం ముదిరాజ్ సంఘ నాయకులు రూ.6 వేలు నగదు, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి పంపిణీ చేశారు. సంఘ నాయకులు కోమటి విష్ణువర్ధన్, పాము రవికమార్, బాలాజీ, పరసా శ్రీనివాసరావు, నాగరాజు, గంజాల సత్యనారాయణ, గోపాలరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

కలిదిండి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బాలిక భద్రత ప్రమాణాల దృష్ట్యా కలిదిండి, కోరుకొల్లు బాలికల హాస్టల్స్ వద్ద పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో కోరుకొల్లు బాలికల హాస్టల్‌లో టాయిలెట్స్‌కి డోర్లు ఏర్పాటు చేయించారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. సీసీ కెమెరాలను పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి నిత్యం పోలీసులు పర్య వేక్షణ చేస్తున్నారు. దీర్ఘకాలికంగా పేరుకు పోయిన పలు సమస్యలను పోలీసులు పరిష్కరించడంతో బాలికల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోరుకొల్లు బాలికల హాస్టల్‌లో టాయిలెట్స్‌కి ఏర్పాటు చేసిన డోర్లు



కలిదిండి బాలికల హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

హరినాథ్‌కు ఉత్తమ మెకానిక్ అవార్డు

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ముదినేపల్లికి చెందిన ఆర్టీసీ మెకానిక్ వెలివెల హరినాథ్ ఉత్తమ మెకానిక్ అవార్డును పొందారు. విజయవాడ-1 ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తూ భద్రతా వారోత్సవాల్లో వాహనాల నిర్వహణలో ప్రతిభ చూపించిన హరినాథ్‌కు ఈ అవార్డు దక్కింది. శనివారం విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మెకానిక్ హరినాథ్‌కు ప్రశంసాపత్రం అందజేశారు.



కలెక్టర్ నుంచి ఉత్తమ మెకానిక్ అవార్డును అందుకుంటున్న హరినాథ్

పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు

కైకలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహిళలు అమ్మవారికి పాలపొంగళ్ళను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈవో కూచిపూడి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయంలో భక్తుల రద్దీ



శ్యామలాంబపురంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

ఆలపాటి విజయం కోరుతూ ప్రచారం

కైకలూరు/ముదినేపల్లి/చాట్రాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల పాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీ ఓట్లతో గెలిపించాలని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం శ్యామలాంబపురంలో ప్రచారం చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. జిల్లా టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధాగ్రామ టీడీపీ నాయకులు ఈదా నాగరాజు, బోడావుల నాంచారయ్య, పాల్గొన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలంటూ ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో తెలుగుదేశం జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలు, మండల బీసీ సెల్ కార్యదర్శి వీరంకి చక్రపాణి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శివ ప్రసాద్, డీసీ ఛైర్మన్ గుడిసేవ సురేష్, నాయకులు గుడివాడ వేణు, యార్లగడ్డ గంగయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి అలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ చాట్రాయి మండలంలోని చనుబండలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులు విద్యావంతులు వివిధ వర్గాల ప్రజల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కరించడం కోసం ఆలపాటికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మోరంపూడి శ్రీనివాసరావు, మారేశ్వరరావు, నక్కా రాము, పరసా శ్రీను, కందుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం

మండవల్లి ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో నూతనంగా నిర్మించిన సాయి బాబా సంకీర్తన మందిరంలో ప్రతిష్ఠించనున్న సాయిబాబా విగ్రహానికి ఆదివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. భట్లపెనుమర్రుకు చెందిన వేదపండితుడు పరాశరం కృష్ణప్రసాద్, శిష్యబృందం గణపతి పూజ, పుణ్యాహవచనం, నిత్యహోమం, జలాధివాసం పూజా కార్యక్రమాలు చేశారు.

అన్నదాన పథకానికి విరాళం

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదాన పథకానికి గుడివాడకు చెందిన సాయన రంజిత్ కుమార్ రూ.11,116 విరాళంగా అందజేశారు. ఆదివారం ఆయన తన విరాళాన్ని దేవస్థానం ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మకు అందజేశారు.

మర్లపాలెంలో అపూర్వ సమ్మేళనం

మండలంలోని మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో 1995-2000 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఆనందోత్సవాల నడుమ జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలో వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కుటుంబాలతో తరలివచ్చి అలనాటి తీపి గుర్తులను పంచుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

చాట్రాయి(ఆంధ్రజ్యోతి)





శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వ చ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరి పారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్య నారాయణ శర్మ, రుద్రపాక మో హన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఈవో తెలిపారు.



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి ప్రధాన కూడలిలో వాహనాలను తనిఖీ చేసి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రమాద తీవ్రత తగ్గి ప్రాణాలు నిలబడతాయన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శుభశేఖర్ హెచ్చరించారు.




బాసవరప్పాడులో ఉన్న వైసీపీ బ్యానర్

ఎన్నికల కోడ్ అమలు ఎక్కడ?

ముసునూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుపై అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లోపూడి గ్రామ పంచాయతీ శివారు బాసవరప్పాడులో ప్రధాన రహదారి పక్కన వైఎస్ జగన్ చిత్రపటంతో బ్యానర్ బహిరంగంగా దర్శనమిస్తున్నా అధికారులు తొలగించలేదు. గ్రామస్థాయిలో ఎన్నికలకోడ్‌ను అమలు చేయాల్సిన వీఆర్వో, కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా నేటికి వారు స్పందించ లేదని నాయకులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

క్రైస్తవుల సంక్షేమానికి రూ.150 కోట్లు : మంత్రి సారథి

నూజివీడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు సెయింట్‌జోన్స్ సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో నిర్మించే సండే స్కూల్ నూతన భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ నిధులను క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, కూటమి నాయకులు, చర్చి ఫాదర్లు, సిస్టర్లు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చర్చిలో మాట్లాడుతున్న మంత్రి సారథి

మంత్రి సారథి దృష్టికి కాట్రేనిపాడు గ్రామ సమస్యలు...

ముసునూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రేనిపాడులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి నాయకులు, స్థానికులు పలు సమస్యలను తీసుకొచ్చారు.బీసీ కాలనీలో ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, గోపవరం నుంచి కాట్రేనిపాడు మీదుగా మీర్జాపురం ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని, వీటిని పక్కకు జరిపేలా చర్యలు తీసుకోవాలని, ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనుంచి పెద్దచెరువులోకి వెళ్ళే సప్లైఛానెల్ వల్ల రోడ్డు కోతకు గురవుతుందని, సైడ్‌వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, ఎస్సీకాలనీ, పంట పొలాలకు వెళ్లే మార్గాల్లో వంతెన నిర్మాణాలు చేయాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మగంటి శ్యామలరావు, రావర్ల ప్రతాప్ సమస్యలు వివరించారు. ప్రతి సమ స్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.



ఎంపీ మహేష్ కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం : ఎంపీ

ముసునూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల అంకమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆదివారం మంత్రి, ఎంపీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గరికముక్కు నాని, గరికముక్కు లక్ష్మణ అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. అనంతరం అన్న సమారాధనలో మంత్రి, ఎంపీలు భక్తులకు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.